# ఆత్మహత్య ★

'కొత్తపాళీ'

రంగాచారి గడపలో అడుగుపెట్టి నివ్వెరపోయాడు ఇంటి ముందున్న అరుగుమీద అనాధులిద్దరు. భార్యభర్తలేమో, కౌగలించుకొని పడుకుని వున్నారు. పట్టపగలు, పదిగంటలవేళ. రోడ్డుమీద నడిచే బండ్లు, ప్రజలు. అప్పుడప్పుడు గాలి విసురుకు ఎగబడేదుమ్ము. ఎండ మిడిసిపడుతున్నది. రంగాచారి కళ్ళుచెదిరి, గుండెల్లో ఏదో సుడిగుండం తిరుగుతున్నట్లనిపించింది. తలుపు మరింత బలంగా గుద్ది "భానూ! విన్నేరా...." అని కేకవేసి, రహస్యంగా జాగ్రతగా మళ్ళీ అరుగువంక పక్క చూపులు చూచాడు.

ఆమె నడుము చేతిలో ఇముడ్చుకుని గుండ్రని రొమ్ముల మీద తలవాల్చి అతను నిద్రపోతున్నాడు. ఆమె జుత్తు నారపీచులాగ అతుక్కొని, అరుగుమీది నుంచి వేళ్ళాడుతోంది. ఆమె రొమ్ము మీద నల్లని మచ్చ. పగిలిన పెదవులు. కృశించిన శరీరం చూచి రంగాచారి వొళ్ళు జలదరించింది. అతని పక్కటెముకలమీద ఎండవాలి పదునుగా మెరుస్తోంది. వారి కాళ్ళవద్ద కూచున్న శిశువు లోకంవంక తేరిచూస్తోంది. పుసికళ్ళు తుడుచుకుంటోంది.

భానూ ఆలస్యంగా తలుపు తెరిస్తే బాగుండుననిపించింది రంగాచారికి. ఎవరైనా చూస్తారేమోననే భయంకూడ. ఆఫీసునుగురించి ఆలోచించటానికి ప్రయత్నించాడు ప్రతిఏడూ పదిరోజులు నిద్రాహారాలు మాని అంకెలు పేర్చవలసిందే. ఐతే ఇన్స్పెక్టరెప్పుడొస్తాడో! వీళ్ళకి ఇల్లులేదుగామాలు ! పాపం. ఐతే సిగ్గన్నా ఉండక్కర్లా - పాపం !

చొక్కావిప్పి పడుకోబోతుంటే భార్యవచ్చి, "లేవరేం - మిమ్మల్నే - అమ్మాయి నీళ్ళతోడి ఎదురుచూస్తున్నది, తువాలిదిగో - లేవమంటే" అని గట్టిగా నిర్లక్ష్యంగా అన్నది.

ఒకసారి తలయెత్తిచూచాడు. భార్య మీద ఎన్నడూ లేని అసహ్యం కలిగింది "నీ అబ్బసొమ్మేం మునిగిందే? అక్కడ వాడు - ఇక్కడ నువ్వు - జీతగాళ్ళకంటె హీనం - పద - నోర్ముయ్యమంటే" అని గదిమాడు

మొట్టమొదటిసారి అదే గదమటం భార్యను. ఆశ్చర్యంతోనో, అలిసివున్నాడనో భార్య వెళ్ళిపోయింది.

లలిత అన్నం వడ్డిస్తోంటే భార్యవచ్చి లలిత పెళ్ళినిగురించి చెప్పటం మొదలెట్టింది" చక్కని పిల్లాడు - చదువుకుంటున్నాడు - మనపిల్ల కేమీ భయం లేదు - అత్తగారు మహాభక్తిపరురాలట- 'తినటానికి లేనివాడికి నాపిల్లని కట్టానా?' అన్నారు - ఇప్పుడీ సంబంధంమాట ఎత్తుకోరేం" జవాబు అక్కరలేనట్లు తనే ఏకరువు పెడుతున్నది.

లలిత పనివున్నట్టు పక్క గదిలోకి తప్పుకున్నది. టెన్నిస్ రాకెట్ బాగు చేసుకుంటున్న భానూ ఎదురై "ఏమిటే అరుచుకుంటున్నారు? నాన్న పెద్దగా మాట్లాడుతున్నాడేమిటేయ్!" అన్నాడు లలిత సిగ్గుతో వెళ్ళి తండ్రికి పక్క వేస్తోంటే లోపలనుంచి తండ్రి కేకలు విన్పించాయి.

"లోకంలో మీకు నచ్చినవాణ్ణెవ్వడైనా చూశానా—ఆశ—ఆశ—తక్కువ వాళ్ళని తలుచుకోముగద-పైవాళ్ళు బుద్ధి లేనివాళ్ళు మనతో కలుపుకోటానికి-ఇక మనలో మనం ఎవరినైనా మెచ్చుకున్నామా? వెధవ పిల్ల పుట్టకపోయినా బాగుండేది-అడుక్కుతిన మను-అడుక్కు తినేవాళ్ళ.... వాళ్ళ...." అంటూమాట్లాడ లేక చరచరలేచివచ్చాడు

జాలిగా చూస్తూ తువాలుతో ఎదురైంది లలిత. రంగాచారి సరాసరి బైటి గడపవద్దకువెళ్ళి అరుగుపంక చూశాడు. అనాథులెప్పుడో వెళ్ళిపోయారు. తెల్లని గోడమీద "స్వర్గసీమ-ఆంధ్రులుగర్వించ వలసిన చిత్రం" అని వ్యాపారం ప్రచారము చేస్తోంది. "పసుపుపెట్టెలో ఓటు స్వాతంత్ర్యానికి బాట" అని కాంగ్రెసు ప్రబోధిస్తోంది ఎర్రని ఎండలో కుంపటి మీది నుసిగాలిలాగ దుమ్ము మడిధోవతి మీదికెగబడింది. తండ్రిజేబులో రు 5 ల నోటు గప్‌చుప్‌గా కాజేసి వెడుతున్న భాను దూరంగా టెన్నిస్ రాకెట్‌తో కన్పించాడు. రంగాచారి చెయ్యెత్తి "అరే భానూ! భానూ-అరేయ్" అని బిగ్గరగా కేకవేశాడు.

భానూ తిరిగిచూచి త్వర త్వరగా అంగలువేసి వెళ్ళాడు.

ఇంట్లోకి తిరిగివస్తోంటే భార్య. విసుక్కుంటూ గొణుక్కుంటూ గ్లాసులు విసిరికొడుతున్న గల్లంతు విన్పించింది.

కళ్ళు మూసుకుపోతున్నాయి. కాని ఆ దృశ్యం ఆలోచనను ప్రేరేపిస్తోంది. గదిలో గాలి బరువెక్కి గుండెమీద కూచున్నట్లనిపించింది. బ్రతుకంతా — ఒకవైపు భార్యయాజమాన్యాన, మరొక వైపు అధికారి దర్పంకింద నిశ్చింతగా వెళ్ళబుచ్చుకుంటున్న రంగాచారిని హఠాత్తుగా బలవంతంగా నిద్ర మేల్కొలిపి నువ్వు అడవిమృగాలలో బ్రతుకుతున్నావని తెలియజెప్పినట్లుంది సర్వాబద్ధం-అబద్ధమంటే నీ బ్రతుకు అని మనస్సు కేకలు పెడుతున్నది. నిశ్శబ్దంగావున్న గదిలో అతనిగుండె దడదడ మ్రోగుతూ గదినిండా ప్రతిధ్వనిస్తున్నట్లనిపించింది,

పక్కగోడతో—భానూ తప, తప, తపమని టెన్నిస్ ఆడుతున్నాడు. కలత నిద్ర మాని, పక్కమీద పొర్లి లేచి "ఎవరే ఇక్కడ—ఉన్నారా? చచ్చారా" అని పెద్దగా "భానూ—" అని పిలవగానే అతను దొడ్డిలోకి పారిపోయాడు.

ఒకనాటి మధ్యాహ్నం బాంకి మానేజరు కులాసాలడిగితే తటపటాయించాడు రంగాచారి మేనేజరు తన సహజధోరణిలో "నువ్వు మిల్కు తీసుకోవాలోయ్ — రంగాచారీ — మనవాళ్ళకి మైండ్ అండ్ బాడీ ఏకబిగిన నడిపించడం తెలీదు—"

"అవునండీ—నిన్న...."

"అనవసరమైనవన్నీ నెత్తిన వేసు

కుంటారు—లుక్ ఎట్ మి—ఇంట్లో, ఆఫీసులో అంతా ఆర్డర్ మైంటైన్ చెయ్యడం నాడ్యూటీ — ఏమిటి ? come, come ఏం జరిగింది ?"

"ఇద్దరు అడుక్కునేవాళ్ళు - మా అరుగుమీద - పడుకుని - పగలు పది గంటలకి - నిద్రపోతూ - పట్టపగలు - పాపం ! - మా బెడ్‌రూం పక్కనేనండి - అరుగు" రంగాచారి వేళ్ళమధ్య పేజీలు వణికాయి.

"ఫూలిష్-మిస్టర్ రంగాచారి-ఫూలిష్-కల్రపుచ్చుకుని బుద్ధి చెప్పాలి ! దీజ్ బెగ్గర్స్ - యు సీ" అని అసహ్యంతో మాటలు వొత్తివొత్తి పలికాడు "ఇటీజ్ నథింగ్ - మీ అరుగు కాకపోక తే ఇంకోటి - వైషుడ్ యు టెల్ మీ - వండ్రఫుల్ - Come Come - లెడ్జర్స్ ఏవీ ?"

నోట్లు లెక్కపెడుతున్న తోటి గుమాస్తా రంగాచారి ఎర్రని ముహం చూసి పక్కున నవ్వాడు. ఉద్వేగంతో కంపిస్తూ, రంగాచారి ఏదో అనబోయి వూరుకున్నాడు

ఊరంతా అనవసరంగా తిరిగి, అలిసి పోయి ఇంటికివచ్చిన రంగాచారి గదిలో కూచుని యోచించుకుంటున్నాడు : అడుక్కునే వాళ్ళకు వయస్సు తెలుసుకోవటం ఎంత కష్టం! పాతికేళ్ళ కుర్రాడు, వాళ్ళచూస్తే తోలుతిత్తి లాగుందను కుని వ్యధపడుతున్నాడు.

వసారాలో భార్య పొరుగమ్మతో రహస్యంగా, "నాగుండెపగిలిపోతుందే తల్లి - పూర్వం ఎట్లా అజమాయిషీ చేశానో ఏమో నాకర్మకాలి - ఇప్పు డనుభవిస్తున్నా ! ఎన్నడూ ఒకమాట ఎరుగాదేవాలా ! - ఇప్పుడింట్లోకొస్తారా-పరాయి ఇల్లు, అంతా పరాయివాళ్ళం - తనేంచేస్తున్నారో ఏం చెపుతున్నారో ఆయనకే తెలియదే - కర్మమమ్మా - పిల్ల దిగులుపడింది-నాకేదిక్కు తోచటంలా" అని చెంగు ముఖానికడ్డం పెట్టుకున్నది.

పొరుగమ్మ ఓదార్పుగా, "ఏఇంట్లో సరిగ్గావుంది చచ్చిందే - మా బావమరిది లక్షాధికారమ్మా - మా గడపతొక్కి ఎరుగడు - అంటే అంటావుగదా - మీరు బీద సంబంధం చేసుకున్నారా ఏవిటి ? మనకుటుంబాలిల్లాగే నాశనమౌతున్నయ్-వల్లకాడు - అన్నదమ్ములకీ, భార్యాభర్తలకీ మధ్య పోరు - ఎవడుసంపాదిస్తే వాడిదే లోకం" అంటూ జాలివటిస్తున్నది. ఎంత ఖరానాగా బ్రతుకుతున్నారోనని ఇంట్లోసామాన్లవంక కలయజూస్తున్నది.

"ఇన్నాళ్ళూ తిండిలేని ముండాకొడుకులకిచ్చి నా పిల్లని నాశం చెయ్యమంటారా ? అంటివి - బాగా ఉన్నవాళ్ళ సంబంధం వొచ్చిందని మా తమ్ముడు చెపితే ఏడిశారులేవోయ్, అంతాదొంగలు పచ్చిదొంగలు. అని వాణ్ణి గదిమె "

పిడుగులాగు రంగాచారి కేక వచ్చి పడింది. "సిగొణుగుడు కట్టిపెట్టు—పిల్లని పిల్చుకురా చెపుతా-ముండాకోరులకి డబ్బుకోసం పిల్ల నమ్ముకుంటావా-నిన్నేనే! బైట ఎవడో బిచ్చంకోసం ఏడుస్తున్నాడు-పో-వెయ్యి-నిన్నే-లే"

పొరుగమ్మ పిల్లిలాగు జారుకున్నది. భార్యలేచి తనలో ఇక బిచ్చగాళ్లే మిగిలాము అని ఈసడించుకుంటూ, బైటికి వెళ్ళి "దొంగలమ్మికొడకా-పొద్దుటినుంచీ

చంపుతున్నావు!, నీతాత మేస్మావన్నా దాచి పెట్టావురా!" తనకోపమంతా అతని మీద వెళ్ళగక్కుతూ "భానూ! వీడికి బుద్ధిచెప్పరా మరీ గడపదాటొచ్చాడు-ఇంతవరకు పూజ మొదలెట్టలేదు-అప్పుడే వీడు" అని చీవాట్లు పెడుతున్నది.

స్కూల్ ఫైనల్ పుస్తకాల చెర తప్పిందింతే చాలని, దూకుతూ బైటికి వచ్చాడు భానూ.

రంగాచారి నిశ్చలంగా గదిలో నిలిచి వింటున్నాడు రెండు నిముసాల్లో, "అయ్యో బాబో-దణ్ణం పెడతాబాబో-వన్నొదులుబాబో-రాను, రాను బాబో-" అని రోదనవిన్పించింది. ముకుపుటాలు, పెదవి కొసలు అదురుతున్నా.రంగాచారి ఊపిరిబిగబట్టి తెల్లవిగోడవంక చూస్తున్నాడు. వెంటనే "ఏమయ్యా—నీకుంటే నువ్వేతింటావ్; చంపుతావా ఏమయ్యా-కొట్టు చూస్తా—ఏం మొనగాడివయ్యా—బైటికి రా చూస్తా-రామరి" అని రోషం పట్టలేక తెగించి అడుగుతున్న మాటలు విన్పించాయి.

రంగాచారి ఒళ్ళు గగుర్పొడిచింది. ఎందుకోగాని సంతోషంగా వుంది. సాయంత్రపు ఎండ వంట గది పొగబారిన కిటికీలోనుంచి లోపలికి ప్రవహించి సాలిగూళ్ళలో తళ తళ లాడుతున్నది. సాలీడు చచ్చినట్లుపడుకున్నది. భానూతల్లికి నోట మాటరాలేదు. రంగాచారి ధటాలున చొక్కా-తీసుకుని తొడుక్కో-కుండానే పెద్ద అంగలు వేస్తూ గుమ్మంలోకి వచ్చాడు. బిచ్చగాడు, నల్లని పెదవిసందుల్లోంచి కారుతున్న ఎర్రని నెత్తుటిబొట్లు లోపలికి పీల్చుకుంటూ, వేలితో తుడుచుకుంటూ నిలబడ్డాడు.

"నాతో రా-లోపలికి-వీళ్ళేం చేస్తారో చూద్దాం - వీళ్ళెవర్రా నిన్ను కొట్టడానికి-రారా - రావేం" భుజంమీద చెయివేసి లోపలికి లాక్కుని వచ్చాడు రంగాచారి.

గదిలో లలిత విని, పెద్దగా ఏడ్వబోయి గొంతు బిగబట్టుకున్నట్లు విన్పించింది. భార్య భానూ నిశ్చేష్టులై చూస్తున్నారు.

"ఎందుకే ఏడుపు - మా కన్నతల్లి - ఏడుస్తుంది - ఏడుస్తుంది" అని, కసితీరిన శత్రువు తృప్తితో అన్నట్లు "నువ్వు పోయి అరుగుమీద పడుకుంటావా - ఎవరితో నైనా పడుకుంటావా - పాపం సొమ్ములు కావాలా ?—మీ దిక్కున్నవాడి దగ్గరికి పోండి - వీడెపుడూ సుఖంగా నిద్రపోయెరగడు - మీరు పుడుతూ తెచ్చుకున్నారా ఇల్లు" అని వడివడిగా మాట్లాడాడు. తన మాటలకు తనే భయపడ్డాడు.

"ఒరే భానూ! రా ఇక్కడికి-అన్నం పెట్టు వాడికి" అని కేకవేశాడు.

బిచ్చగాడు భయంతో, సంభ్రమంతో ముందు వెనకలు చూస్తున్నాడు. కిటికీ వెనుకనుంచి దొంగచాటుగా చూస్తున్న భానూ, ముందుకివచ్చి అన్నంకోసం గదిలోకి వెళ్ళిపోయాడు.

రంగాచారి, పడకగదిలోకి వెళ్ళి చొక్కా వొంకెను తగిలించి, పడుకున్నాడు. తననేదో ఆవేశించింది దేహం చెమటపట్టి చల్లబడింది. ఆయాసం హెచ్చుతున్నది.

కొంతసేపటికి మెల్లగా భానూను పిలిచి-

"కర్రతో కొట్టావుగదూ ?"

తల వూపాడు.

"నువ్వెవరు ? నువ్వెవర్రా కొట్టటానికి ?"

మాటలేదు.

"వాడికి మంచిచొక్కా ఇయ్యి — నీళ్ళియ్యి—నువ్వు చేసింది తప్పేనా ? వాడు నీకంటె పెద్దేగదు ? నీ తండ్రి వంటి బ్రాహ్మడు వాడికిలేక, అడుక్కుంటున్నాడు."

భానూ ఒకసారి తలయెత్తి ఆశ్చర్యంగా చూసి దించుకున్నాడు

"వాడిపని చూడు___"

"అమ్మ - -" అని మెల్లగా చప్పరించాడు భాను.

"నోరు మూసుకొని పడుకోమను" అని గట్టిగా అన్నాడు.

భార్య అలిగి, లలిత పెళ్ళివిగురించి తమ్మునితో సంప్రదించే సాకుతో పుట్టింటికి బయలుదేరింది లలితమాత్రం దిగులుతో, పెళ్ళిని గురించి దుస్వప్నాలతో అన్నం ముట్టుకోవడం మానేసింది

భానూ స్కూలుమాని బిచ్చగాడితో కాలం గడుపుతున్నాడు. చెన్నిస్వామి అతను చెప్పేకథలు వింటున్నందుకు లలిత ఆశ్చర్యపోయి, తండ్రి పట్నం నుంచి 'రాగానే పీడిపని పట్టిస్తా' నను కున్నది.

తలుపువద్ద చెవియొగ్గివిన్నది.

"సినిమాదగ్గర సత్రంలేదూ-అక్కడ రెండో ఆట సాగించారు - మావాళ్ళంతా అందులో పడుకుంటారులెండి."

"సత్రంలో ఏముంది ?"

"మహానుభావు డొకాయన కట్టించాడు - ఆయన కొడుకు - ధాన్యం విలవ బోశాడులెండి - తాళాలేసుంటయ్ - అబ్బ! రాత్రింబగళ్ళు ముక్కిపోయిన వాసనతో చస్తుండాం."

"ఈరోజుల్లో దాచిపెట్టాడా-ఆవరండాలోనే నా పిల్లచచ్చిపోయింది - అన్నం లేక అని చెపితిపే"

"దాన్దేముందిలెండి — చస్తుంటారు గాని-" అని నిర్లక్ష్యంగా పలికి "ఆయనొచ్చి రోడ్డుమీదినుంచి మాకేసి చూస్తావుండాడు-భయంగా అటూ ఇటూ పారచూసేవారు - మాపక్కనే కూచుని, మేమంతా చా తాగుతుంటే, అర్ధణాపెట్టి కొని ఒకగుక్కెడు తాగి వూసిపారేశాడు"

"నాన్నా? ఎందుకు వుమిశాడు"

"డబ్బాటీ లేండి- అలవాటులేనోళ్లకి బాగుండదు. వుగాకేసుకుని తాగుతే తెలియదుగాని"

"మొన్న నిన్ను గుర్తుపట్టాడా? "

"మీరుకొట్టిన నాడా? "

" అలాఅనొద్దు వెంకడూ — నాకు కష్టంగా వుంటుంది "

" దాన్దేముందిలెండి-నాఒళ్ళుబొప్పులకట్టింది-వీపుచూడండి"

లలితకు, పెద్దగా వెకిలినవ్వు విప్పించింది. నువ్వు వెళ్ళొద్దు, నాన్న వచ్చేవరకు వుండమని భానూ పట్టుబట్టడము, బిచ్చగాడు వెళ్ళిపోతానుండలేనని నొక్కి చెప్పడము విన్నది. ఖంగారుగా గదిలోకి పరుగెత్తింది. ఇల్లు దయ్యాలకొంపలాగ భయంపుట్టిస్తున్నది ఇల్లు, ఆఫీసుతప్ప ఇతరం ఎరుగని తండ్రి

పిచ్చివాడిలాగ వీధులంట తిరిగాడా ఈ నెలరోజులు? భానూకేం మతిపోయింది? స్కూలులేదు. పూర్వంలాగ యింట్లో డబ్బు ఎగేసుకు పోవడంలేదు. వాడి తత్వమేమారింది. అమ్మెప్పుడొస్తుందో, అమ్మెప్పుడొస్తుందో - ఆపూళ్ళో పెళ్ళి కాని అమ్మాయి పురిపోసుకుందటగా— అని తలపోస్తూ ఏడ్చి ఏడ్చి బడలికతో నిద్రపోయింది.

హెడ్ ఆఫీసులో లెక్కల పుస్తకాలు తనిఖీ చేయించి తండ్రి తిరిగివచ్చాడు. అధికారులు మెచ్చుకున్నారని గుమాస్తాలు అసూయపడ్డారు. ఇరవైయేళ్ళ సర్వీసు నిష్ప్రయోజనం కాదులే అని అధికారులు ఊరడించారు. రంగాచారి ఏసగించుకున్నాడు.

భానూ ఎక్కడున్నాడని లలిత నడిగితే, టెన్నిస్ రాకెట్ అమ్మేశాడని, రాత్రిం బగళ్ళు పుస్తకాలు, పేపర్లు చదువుతుంటాడని, ఎప్పుడూ ఎవరో స్నేహితులు వెంటాడుతుంటారని చెప్పుతున్నది. పిలిస్తే జవాబుగూడా యివ్వక పరధ్యానంగా వుంటాడని, ఒంటరిగా ఉండటం భయమేస్తోందని, భానూను మళ్ళీ ఏమీ అడుగవద్దని విన్నవించింది.

మరునాటి సాయంత్రం భానూను పిలిచి "తెల్లకాగితం అందుకో—జవాబు వ్రాయాలి—మీ అమ్మ ఉత్తరంవ్రాసింది" అన్నాడు రంగాచారి. లలితకు ఏదో పనిచెప్పి గదిబైటికి పంపాడు.

"—సంగతులు తెలిసినవి—ఆస్థిపరుల యింటితో వియ్యమందటకు నాకే మాత్రం ఇష్టముగా లేదు. మన కుటుంబాలలో దుర్బుద్ధులు లేనివాళ్ళు, పనిచేసి న్యాయంగా బ్రతికేవాళ్ళు లేరు—మీవుత్తరం చదివి నన్ను పిచ్చివాడికింద లెఖ్ఖ కట్టినట్లు తేల్చుకున్నాను— నా మనస్సు మారిందో లేదో నాకు తెలియదు— మొత్తంమీద నాకేమీ బాగాలేదు— నా దుఃఖం చెప్పుకోటాని కెవరూ లేరు. ఉద్యోగం మానివెయ్యా లనుకుంటున్నాను ఈ కారు కుర్రవాళ్ళంతా చెడిపోయిన రకం—భానూ నడవడిచూస్తే ఈ సంగతి - -"

తండ్రి వాక్యాలకు సంతోషిస్తూ వుత్తరం వ్రాస్తున్న భానూ, చటాలున తలయెత్తి నిశ్చితంగా "నేను చెడిపోలేదు నాన్నా!" అన్నాడు.

వాక్యంఆలోచిస్తున్న తండ్రి కోపంగా "చీట్లపేక మంచిదేనా? ఆడుక్కునే వాళ్ళని కర్రతో బాదడం మంచిదేనా? చెప్పవేంరా!" అని ఉగ్రుడైనాడు.

భానూ ముహం పశ్చాత్తాపంతో ఎర్రబడింది. "కొట్టాలని కొట్టలేదునాన్నా - అతని చెయ్యి విరిగిందని పనిలోనుంచి తీసేశారంట - నిన్న మీటింగుకు వెళ్లా - వాళ్ళునాకు తెలుసునాన్నా."

"ఎవరు రా?"

"కూలీలు"

"ఏ కూలీలురోయ్"

"మిల్లులో కూలీలు - వాడుబూటుకాలితో తన్ని బైటికి నెట్టాడు - అంతా మీటింగుపెట్టి వాణ్ణిచేర్చుకోవాలని తీర్మానం చేశారు."

చీకట్లో వెతుకుతున్న వస్తువేదో లభించినట్లు తండ్రి దీర్ఘనిశ్వాసం విడిచి త్వరత్వరగా అదేరా - అదే - అదే - పాపం అదే - నా కదే బాధగావుందిరా -

ఇంకా ఏంజరిగింది ? చెప్పు - చెప్పు - చెప్పవేంరా! పంచదారమిల్లు గోకూలీని, నీ పిల్లలికి పంచదార తీసుకోవద్దంటే ఎంతకోపంగా వుంటుంది-ఐతే అబ్బాయ్-స్కూలు మానేస్తే ఎట్లా ? మనకు తగింది కాదురా - ఊరేగింపుల్లో తిరగడంలేదు గద! వొద్దు" అని విరాలోచనతో కిటికీలో నుంచి బైటికి చూచాడు

సిగరెట్టు టిన్నులమీద వేళ్ల మీటుతూ కొందరు డబ్బుపెట్టి పేక ఆడుతున్నారు. ఒకమూల ఇనుపపొయ్యిమీద వంటవాడు కాఫీ కాచుతున్నాడు. చల్లని గౌరవర్ణపు ఎండ, వాళ్ళ కళ్ళద్దాలమీద కళకళలాడుతున్నది. ఆవిరి పొగ వుంగరాలుగా నీలంగా పైకిసాగి మాయమౌతున్నది. వంటవాడు వేళ్ళు కాలి, నోట్లో పెట్టుకుంటుంటే దీక్షగా చూస్తుంటే దీక్షగా చూస్తున్నాడు. భానూ. మెరిసే బంగారపు వుంగరాలవంక చూస్తున్నాడు, రంగాచారి

ఇన్స్‌పెక్టరు వచ్చాడనీ బాంకి గుమాస్తాలు రాత్రి గం. 9 ల వరకూ కుర్చీల్లో నలుగుతూనే వున్నారు. రంగాచారి ఇంటికి బయలుదేరుతున్నప్పుడు మానేజరు పిలిచి. "నన్ను హెడ్‌ఆఫీసుకు రమ్మన్నారు-భాన్సు కొట్టావులే - నువ్వు మానేజరవుతున్నావోయ్ — అయామ్ ఆల్వేస్ హోప్‌ఫుల్ - కంగ్రాచ్యులేషన్స్" అని. మెల్లగా "నొ - కం.... కం.... నథింగ్ అఫ్ దట్ నాన్‌సెన్స్" అని హెచ్చరించాడు.

తలవంచుకుని రోడ్డున నడుస్తూ, కలలు గంటూ, భానూతో తను కూలీల మీటింగుకు వస్తానని చెప్పిన మాట మరిచిపోయాడు.

మెల్లగా లలితను పిలిచి, తప్పు ఒప్పుకున్నట్లు "ఇకో రూ 50 లు ఎక్కువొస్తాయే అమ్మాయ్ మానేజరు చేశారు నన్ను" అన్నాడు కలతపడుతూనే, ఇంటివెనుక స్థలంకొని కలపుకోవాలని ఆలోచిస్తూనే నిద్రపోయాడు.

'ఉత్తరంలో వ్రాసినట్లు రేపే చెప్పి పారేస్తాను రాజీనామా రేపే రాసిపారేస్తాను. రాజీనామా ఇచ్చి ? వాళ్ళతోనా - అమ్మో కష్టమే—ఐనా రాసిపారేస్తాను' అనుకుంటూ పదిరోజులు సక్రమంగా ఆఫీసుకు హాజరైనాడు.

ఇంతలో భార్య బావమరిదితోసహా వచ్చి దిగింది.

వచ్చి వారం గడుస్తున్నా, పెండ్లి మాట ఎత్తకపోవటం గమనించి, భానూతో "మీ మామ ఏమంటున్నాడ్రా-ఏమిచెప్పడూ అతనూ ఆదీ గుసగుసలాడుకుంటారు— లలిత నేదో అడుగుతున్నట్టుందే" అన్నాడు

భానూతల్లి,విని దగ్గరగావచ్చి "వాళ్ల మనిషిని పంపాలు - మీతో అనలేక తమ్ముడు కిందుమీదౌతున్నాడు" అని నిర్లక్ష్యంగా అని, ఆప్యాయంగా "లలిత మనస్సు కష్టపెట్టి, నన్నూ మావాళ్ళని ఆడిపోసి మీరేం పుణ్యంకట్టుకున్నారండీ! నాకు మనసు మనసులోలేదు మిమ్మల్ని చూస్తే-నాకర్మ - మేనేజరు ఉద్యోగమైందని పెళ్ళాంతో అనని భర్తవుంటాడా?" అని ముహం చిన్నది చేసుకున్నది.

"నువ్వివ్రా - కూచో చెప్తా - భానూ! వెళ్ళి మీమామతో చెప్పు - ఎల్లుండి

తెలవు - ఆయన్ను తీసుకురమ్మను" అని పంపించాడు.

భార్య పక్కకొచ్చి, 'ఏళ్ళుముదిరే కొద్దీ మరీ పసిపిల్ల లౌతున్నారు' అని ముద్దుగా పలుకుతూ గడ్డం పట్టుకుని "మీ సంతోషం నా సంతోషం కదూ - ఎందుకు చెప్పలే?" దని చిరునవ్వు నవ్వింది.

రంగాచారి నవ్వురాక ఆరాటపడుతూ "అందులో ఏముంది? ఉత్తరంలో రాశానుగా - నాకేం తోచడంలేదు, నన్ను చంపకండి" అని విసుగ్గా లేచినిలబడ్డాడు. అతని భుజాలు భార్య గట్టిగా పట్టుకుని "పోనీ ఒకసారి నవ్వండి - మిమ్మల్నే" అంటూ మెల్లగా ముందుకు లాక్కుపోయి పక్కమీద వాల్చింది. తలుపులు, కిటికీలు మూసివచ్చి ప్రక్కనే అదుముకుని పడుకుని, "నా కర్మ - ఇన్నాళ్ళూ ఇంటి పెత్తనం చేశానని నన్నిట్లా శిక్షిస్తారా! నాకు తగిన శిక్షే-బుద్ధివచ్చిందిగా చెంపలు వేసుకున్నాగా - మీ మతి మారిందని హడిలిపొయ్యాం - తమ్ముడు రూ. 30 లుపెట్టి అభిషేకం చేయించాడు. ఒకరోజు సంతర్పణ చెయ్యాలంటున్నాడు - మీరు నాకు దక్కితేచాలు" అని వలవల ఏడ్చింది.

రంగాచారి గుండె రాయిలాగ బరువెక్కింది. ఏమి మనుషులురా భగవంతుడా- ఏం సంసారంరా-ఒక సంసారం మీద ఇంకొకటి కత్తినూరని లోకాన్నెందుకు సృష్టించవురా తని తపించాడు. బైటికి మాత్రం ఒసే—నాబాధ నీకేం తెలుసే-ఐనా-ఐనా- నేను బ్రతికున్నంత కాలం మీకు తక్కువ చేస్తానంటే - ఏం మాటలే" అని ఊరడిస్తూ దగ్గరగా లాక్కుని ముద్దుపెట్టుకున్నాడు.

పెండ్లివారు విడిదిలో వచ్చిదిగారు. పందిరి మధ్య తోరణాలు కట్టిస్తూ రంగాచారికి తీరికేలేదు లలితకు ఉత్సాహం వల్ల సిగ్గు అపరిమితమయింది. భార్య ఆడబంధువుల గుంపుతో మేళతాళాలతో ఇంటింటికీ తిరిగి పేరంటానికి పిలుస్తున్నది. శిల్కుచీరలు, ఎదువు సొమ్ములతో ముచ్చట పడుతున్నారు ఆడవాళ్లు.

ఊళ్ళో పెద్దల్ని ఆహ్వానించటానికి భానును పంపమని రంగాచారికి బావమరిది సలహా ఇస్తున్నాడు. పక్కగా చరచర వెళిపోతున్న భానూ, "రేపు ప్రొద్దునొస్తా పనుంది-పక్కవూరికెళ్లాలి" అని జవాబుకోసం ఎదురుచూడలేదు,

రంగాచారి నిస్తబ్ధుడై లోపలికివెళ్ళి జడ అల్లుకుంటున్న లలితతో" చూడూ! భానూ ఎక్కడా కనబడదేం-ఇంతహడావుడిగా వుంటే - నన్నొక్కణ్ణే సతమతమై చావమంటారా - పొద్దున రూ. 5 లు కావాలని తీసుకున్నాడు - ఎందుకో - నా కొక్కడికే పట్టిందా ఏమిటి" అన్నాడు.

లలిత సిగ్గుతో కంపిస్తూ, అన్నది, నోట్లో నాలిక లేనట్లు "నిన్నే నే-మంచి మొగుణ్ణిసంపాదించారేయ్-మద్రాసులో క్లబ్బుల్లో డబ్బు తగలేస్తాట్టలే-జమీందారుబిడ్డట-ను వ్వేడవాల్సిన పనిలేదేయ్-ఎంత మందిని కనాలనుకుంటున్నావ్ - అని ఏడిపించాడు నాన్నా. చెవులు పట్టుకుని సాగదీశాడు - ముసలోడు కొత్తచీరలు కొన్నాడా అన్నాడు"

రంగాచారి ముఖం వికృతమై, కనుబొమ లెగురవేస్తూ, "నేనా - నేనేనా -

మనలోణ్ణి కుర్రకుంక - ఇప్పుడు తెలివొచ్చిందేం తనకి" అంటూ రుసరుసలాడుతూ తిరిగి వెళ్ళాడు.

"వాణ్ణేమనబోకు నాన్నా" అని లలిత ప్రాధేయపడింది.

రంగురంగుల విద్యుద్దీపాల తోరణాల మధ్య, పెండ్లి బంధువుల కోలాహలంలో వాద్యగాండ్రు పీకలువూది సరిచూస్తున్నారు. పందిరిలో తాంబూలాలు సేవిస్తున్న బంధువుల్లో గుసగుసలు బయలుదేరి "పిళ్ళబ్బాయి - వొట్టి తుంటరి వెధవటండీ - మనకు తెలియే తెలియదు చూశారా" అని ఒకరు,

"వొట్టి తిరుగుబోతు ాగుంది - మొన్న జండాలు పట్టుకుని పోతున్నాడండీ" అని మరొకరు

ఈ కాలపు కుర్రాళ్ళు నమ్మిడీ సంపారించలేరుగదా, దేవుడు లేడంటారు" అని ఒక వృద్ధు విచారం వెలిబుచ్చారు.

రంగాచారి బావమరిది ఏమీ వినన్నట్లు కూచుని "కుర్రవాడంటే వాడండీ— అఫిషియల్ క్లబ్బులో వాడు మెంబరండీ! మా భానూ — ఆఫీసర్లంతా వాడి ఫ్రండ్సండీ" అని తన మాటలు తనే నమ్మినట్లు నిశ్శబ్దంగా లేచి రంగాచారి దగ్గరికి వచ్చాడు.

పెండ్లి కోలాహలం వివిధవాద్యాలు. విద్యుద్దీపాలు, చూచేందుకు గుమికూడి బీద వాళ్ళు పందిరిచుట్టూ గుంపులుగా నిలబడ్డారు. వెళ్ళిపొమ్మని రంగాచారి కేకలు వేస్తున్నాడు బావమరిది ఏదో అంటే. ముహంతిప్పి, "వాణ్ణి గురించి నన్నడగకండి—వాడున్నా పోయినా ఒకటే—దిక్కుమాలిన కొడుకు" అని విసదించుకున్నాడు "ఈ అలగాజనం ఇట్లా విరగబడుతుందేం. ఏం పొయ్యే కాలమొచ్చింది" అని ఇంకా చెప్పబోతున్నాడు.

భానూ, కర్రలచివర అతికించిన అట్టలమీద ఎర్రని పెద్దక్షరాలు వ్రాసి పట్టుకుని. పెళ్ళి బంధువులమధ్యగా వెళ్ళి జనం ముందు ఆగి, "ఏం చూస్తారోయ్- ఏమిటి చూచేది— మీ కేం. భోజనాలు లేవు—ఇంటివెనుక భూమి అమ్మింది మీరేగా, పదండి-మైదానంలో బియ్యాన్ని గురించి మీటింగుంది—రండి" అని చరచర వెళ్ళిపోయాడు.

పెండ్లిబంధువులు తృప్తిగా నవ్వుకున్నారు.

భార్య రంగాచారి పక్కకువచ్చి. చెవిలో "చూడండి—వాడు—వాణ్ణి పట్టడము మనశక్యంకాదు" అని చెంగు ముఖాని కడ్డంపెట్టుకున్నది

రంగాచారి నిశ్చేష్టితుడై విగ్రహంలాగ నిలబడ్డాడు.

★

"అధ్యాపకులందరూ విద్యార్థులతో కలసి మెలసి తమ విషయాలు చక్కగా బోధించారు. తమ దృక్పథాలనూ సిద్ధాంతాలనూ ఎంతో ఓర్పుతో వివరించారు.

"వచ్చిన రచయితలందరికీ అంతో ఇంతో ఉపయోగం కలిగి తీరింది...."

—భాషాప్రవీణ, కొత్తపల్లి రంగారావు.